ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
Bullet Edition
సోమవారం 8 డిసెంబరు 2025 www.prajaswaramdaily.com 1 pm

# 11 మంది మావోయిస్టులు లొంగుబాటు

## మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు రాంధెర్‌కూడా

## అతనిపై రూ. 3 కోట్ల రివార్డు

రాయ్ పూర్, ప్రజాస్వరం
ఛత్తీస్‌గఢ్‌లో మరో 11 మంది మావోయిస్టులు లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు రాంధెర్ ఉన్నారు. ఆయనపై రూ.3 కోట్ల రివార్డు ఉంది. ఎంఎంసీ(మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్) జోన్‌లో ఆయన క్రియాశీలకంగా ఉన్నారు. మిళింద్ తెల్తుంబే మరణించినప్పటి నుంచి రాంధెర్ ఎంఎంసీ బాధ్యతలు చూస్తున్నారు. ప్రస్తుతం ఆయన లొంగుబాటుతో మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులు నక్సల్స్ రహిత ప్రాంతాలుగా మారాయి. ఇటీవల వివిధ రాష్ట్రాల్లో పోలీసుల ఎదుట మావోయిస్టులు లొంగిపోతున్న సంగతి తెలిసిందే.



# ఫ్యూచర్‌సిటీకి దేశాల ప్రతినిధులు

## తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్

హైదరాబాద్, ప్రజాజ్వరం
తెలంగాణ ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్' ను మధ్యాహ్నం ఒంటి గంటకు గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ప్రారంభిస్తారు. రంగారెడ్డి జిల్లా కందుకూరులోని ఫ్యూచర్ సిటీలో 100 ఎకరాల విస్తీర్ణంలో సోమ, మంగళవారాల్లో జరగనున్న ఈ సదస్సుకు 44 దేశాల నుంచి 154 మంది ప్రతినిధులు హాజరవుతున్నారు. సుమారు రెండు వేల మంది దేశ, విదేశీ అతిథులు ప్రారంభ వేడుకకు హాజరుకానుండడంతో అత్యాధునిక హంగులతో ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం రెండున్నర గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తారు. తెలంగాణలో ప్రజాపాలన, పెట్టుబడుల అవకాశాలు, ప్రభుత్వం అందించే సహకారం, విజన్ 2047 డాక్యుమెంట్ లక్ష్యాలు, భారత్ ఫ్యూచర్ సిటీపై ముఖ్యమంత్రి వివరిస్తారు. జాతీయ, అంతర్జాతీయ ప్రముఖులు, పలు దేశాల ప్రతినిధులు ఫ్యూచర్



సిటీకి వద్దకు చేరుకుంటున్నారు. సమిట్‌కు హాజరయ్యే ప్రముఖులు బస చేసే హోటళ్ల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. కమాండ్ కంట్రోల్ నుంచి ప్రతినిధులకు లైజనింగ్ ఇచ్చేందుకు ప్రత్యేక అధికారులను నియమించారు. వీవీఐపీ పారిశ్రామికవేత్తలకు డీఎస్పీ ర్యాంకు అధికారితో భద్రత కల్పించారు. వీవీఐపీ పారిశ్రామికవేత్తలు, సీనియర్ ఐఏఎస్‌లకు యాక్సెస్ పాస్‌లు ఇచ్చారు. సీఎం, ప్రముఖులు మాట్లాడే ప్రధాన హాలులో 2వేల మంది కూర్చొనేలా ఏర్పాట్లు చేశారు. వివిధ సంస్థల ప్రతినిధులతో శాఖలవారీగా సమావేశాల తర్వాత ఒప్పందాలు జరగనున్నాయి. ఈ గ్లోబల్ సమిట్‌కు సినీ, క్రీడా, విద్యారంగాల ప్రముఖులు కూడా హాజరుకానున్నారు.

# 350 ఇండిగో సర్వీసులు రద్దు

## ఏడో రోజూ సంక్షోభం

ముంబయి, ప్రజాస్వరం
దేశవ్యాప్తంగా 350కి పైగా ఇండిగో సర్వీసులు రద్దయ్యాయి. ఒకపక్క ఈ పరిస్థితులను చక్కదిద్దేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ.. ఏడో రోజూ సంక్షోభం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో దిల్లీ ఎయిర్‌పోర్ట్ ప్రయాణికులకు అడ్వైజరీ జారీ చేసింది ఈరోజు ఉదయానికి దిల్లీ ఎయిర్‌పోర్టు నుంచి 134, బెంగళూరు నుంచి 127, చెన్నై నుంచి 71, అహ్మదాబాద్ నుంచి 20, ఇతర విమానాశ్రయాల నుంచి మరికొన్ని ఇండిగో (%×అఎఅ్రశ్రీ%) సర్వీసులు రద్దయ్యాయి. ముంబయి, కోల్‌కతా విమానాశ్రయాల్లో అంతరాయం కొనసాగుతోంది. ఇండిగో సర్వీసుల్లో తీవ్ర అంతరాయంపై ఇండిగో సీఈవో పీటర్ ఎల్బర్స్ కు షోకాజ్ నోటీసులు ఇవ్వగా.. సమాధానం ఇచ్చేందుకు ఇచ్చిన గడువును మరో 24 గంటలకు డీజీసీఏ



పొడిగించింది.

## ట్రేడింగ్‌లో 7 శాతం షేర్లు పతనం

వైమానిక సేవల సంస్థ ఇండిగో మాతృసంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ లిమిటెడ్ షేర్లు స్టాక్ మార్కెట్లలో భారీగా పతనం అవుతున్నాయి. ఇప్పటికే గత ఐదు సెషన్లలో 9 శాతానికి పైగా విలువ కోల్పోయాయి. సోమవారం ట్రేడింగ్ ప్రారంభంలో ఒక్కసారిగా 7శాతం పతనమైంది. ఆ తర్వాత కొద్దిగా కోలుకొంది. ఉదయం 10 గంటల సమయంలో 3.92 శాతం (రూ.210.50) నష్టంతో రూ.5,160 వద్ద ట్రేడవుతున్నాయి.

# ఐఏఎస్ ఆమ్రపాలికి హైకోర్టులో చుక్కెదురు

### క్యాట్ ఉత్తర్వులను నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ



హైదరాబాద్, ప్రజాస్వరం
ఐఏఎస్ అధికారి ఆమ్రపాలికి తెలంగాణ హైకోర్టులో చుక్కెదురైంది. గతంలో ఆమ్రపాలిని తెలంగాణకు కేటాయించాలని క్యాట్ ఇచ్చిన ఆదేశాలపై హైకోర్టు స్టే విధించింది. క్యాట్ జారీ చేసిన ఈ ఉత్తర్వులను నిలిపివేస్తూ తెలంగాణ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో, ఆమ్రపాలికి కేటాయింపు విషయంలో తాత్కాలికంగా అడ్డంకి ఎదురైంది. ఈ సందర్భంగా, హైకోర్టు ఐఏఎస్ ఆమ్రపాలికి కౌంటర్ దాఖలు చేయాలని సూచించింది. అనంతరం, ఈ కేసుకు సంబంధించిన తదుపరి విచారణను 6 వారాలకు వాయిదా వేస్తున్నట్లు తెలంగాణ హైకోర్టు తెలిపింది.

# ఊరికెళ్లి వచ్చే సరికి ఇల్లు గుల్ల

## 40 తులాల బంగారం, రూ. 6లక్షల నగదు చోరీ

కల్వకుర్తి, ప్రజాస్వరం
నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలో భారీ చోరీ జరిగింది. విద్యానగర్‌లో పూజారి శ్రీనివాస శర్మ ఇంట్లో బంగారం, నగదును దొంగలు ఎత్తుకెళ్లారు. నవంబర్ 30న కుటుంబ సభ్యులతో కలిసి ఊరెళ్లిన ఆయన.. సోమవారం ఉదయం ఇంటికి తిరిగి వచ్చారు. బీరువాలోని వస్తువులు చిందరవందరగా పడి ఉండటాన్ని గుర్తించారు. ఇంట్లో ఉన్న సుమారు 40 తులాల బంగారు నగలు, రూ.6 లక్షల నగదు చోరీకి గురైనట్లు శ్రీనివాస శర్మ తెలిపారు. ఈ ఘటనపై ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఘటనాస్థలిని పరిశీలించి విచారణ చేపట్టారు.

# రియాల్టర్ దారుణ హత్య

## కత్తులతో నరికి చంపిన దుండగులు

జవహర్ నగర్, ప్రజాస్వరం
జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సాకేత్ కాలనీ ఫాస్టర్ బిలభాంగ్స్ స్కూల్ ముందు ఘంటా వెంకటరత్నం(50) అనే రియాల్టర్ దారుణ హత్యకు గురయ్యాడు. పాఠశాలలో పాపను దించి స్కూటర్ పై తిగిగి వెళుతున్న వెంకట రత్నం పై దుండగులు కత్తులతో నరికి చంపారు. ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటనా స్థలానికి మల్కాజిగిరి డీసీపీ శ్రీధర్, పోలీసులు చేరుకున్నారు. కేసు నమోదు చేసుకుని జవహర్



నగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

# చారిత్రక ఘట్టానికి మనం సాక్షులం


## ప్రధాని మోదీ

## వందేమాతరంపై 10 గంటల పాటు చర్చ..

ఢిల్లీ , ప్రజాస్వరం
“వందేమాతరం 150వ చారిత్రక ఘట్టానికి మనం సాక్షులుగా నిలిచాం అని ప్రధానిమోదీ అన్నారు. 'వందేమాతరం' 150వ వార్షికోత్సవాలను పురస్కరించుకొని ఆ గేయంపై ప్రత్యేక చర్చకు పార్లమెంట్ వేదికైంది. లోక్‌సభలో సోమవారం ఆయన ఈ చర్చను ప్రారంభించారు. ఈ చర్చ సభ నిబద్ధతను తెలియజేయడంతో పాటు.. మనం సద్వినియోగం చేసుకొంటే భావితరాలకు కూడా ఉపయోగపడుతుందని చెబుతోందన్నారు. దేశం సర్దార్ పటేల్, బిర్సా ముండా 150వ జయంతి ఉత్సవాలను జరుపుకొంటోందన్నారు. వందేమాతరం రాసిన వేళ భారత్ బానిసత్వంలో ఉందని, దానికి 100 ఏళ్లు పూర్తయిన వేళ భారత్ రాజ్యాంగం గొంతు నొక్కేశారని, ఏ వందేమాతరం భారత్‌కు స్వేచ్ఛావాయువులు ఇచ్చేందుకు ఉపయోగపడిందో.. దాని 100 ఏళ్ల సమయంలో చీకటికాలం నడిచిందన్నారు. . 1947లో ఇదే గేయం మనకు స్వాతంత్ర్యం ఇప్పించిందన్నారు. ఈ చర్చలో అధికార, ప్రతిపక్షాలు లేవు అని అన్నారు. బంకించంద్ర ఛటర్జీ తొలుత 1875లో దీన్ని రచించారని, తర్వాత తన ఆనంద్‌మఠ్ నవలలో దీన్ని భాగం చేశారని అన్నారు.







# గొంతులో చికెన్‌ముక్క ఇరుక్కొని.. వ్యక్తి మృతి

రాజన్న సిరిసిల్ల, ప్రజాస్వరం
చికెన్ ముక్క గొంతులో ఇరుక్కోవడంతో ఓ వ్యక్తి మరణించాడు. ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలో ఈ సంఘటన జరిగింది. గ్రామానికి చెందిన పాటి సురేందర్ (42) ఆటో డ్రైవర్ గా పని చేస్తున్నాడు. ఆదివారం కావడంతో సురేందర్ చికెన్ తీసుకొచ్చి వండమని చెప్పి ఇంట్లో ఇచ్చి వెళ్లాడు. సాయంత్రం ఇంటికి వచ్చి చికెన్ కర్రీతో తింటుండగా ఓ ముక్క గొంతులో ఇరుక్కుంది. దీంతో సురేందర్ ఊపిరి ఆడక ఇబ్బంది పడ్డాడు. చేతితో తీసేందుకు ప్రయత్నించినా రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు సురేందర్ ను వెంటనే ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే ఆయన మరణించారని వైద్యులు తెలిపారు. కాగా, సురేందర్ కు భార్య కవిత, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆటో డ్రైవర్ గా సురేందర్ సంపాదనతోనే కుటుంబం గడుపుతున్నామని, కుటుంబ పెద్దను కోల్పోవడంతో తమకు దిక్కులేకుండా పోయిందని మృతుడి భార్యాపిల్లలు వాపోతున్నారు.

### ప్రముఖ నటిపై లైంగిక దాడి కేసులో

# నటుడు దిలీప్ నిర్దోషి



తిరువనంతపురం ,ప్రజాస్వరం
ప్రముఖ నటిపై లైంగిక దాడి కేసులో నటుడు దిలీప్ నిర్దోషి గా ఎర్నాకుళం కోర్టు తీర్పు నిచ్చింది. ఎనిమిదేళ్ల క్రితం కేరళలో అప్పటి మలయాళ ప్రముఖ నటిపై ఈ లైంగిక దాడి జరగ్గా.. ఆ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. 2017లో మలయాళ నటి కిడ్నాప్ కేసు సంచలనం రేపింది. కారులో ఆమెపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు నటుడు దిలీప్‌పై ఆరోపణలు వచ్చాయి. ఈ కేసులో అతడు అరెస్టయి బెయిల్‌పై విడుదలయ్యాడు.

# సర్పంచ్ అభ్యర్థి అనుమానాస్పద మృతి

సంగారెడ్డి, ప్రజాస్వరం
సంగారెడ్డి జిల్లా సర్పంచ్ అభ్యర్థి చాల్కి రాజు అనుమానాస్పదంగా మృతిచెందాడు. రాయికోడ్ మండలం శంశోద్దీన్‌పూర్ గ్రామంలో ఘటన జరిగింది. కాంగ్రెస్ మద్దతుతో పీపడ్‌పల్లి గ్రామ సర్పంచ్‌గా పోటీ చేస్తున్నాడు. నిన్న రాత్రి మద్దతుదారులు, అభ్యర్థి మధ్య వాగ్వాదం జరిగింది. ఉదయం చెట్టుకు ఉరి వేసుకుని విగతజీవిగా కనిపించాడు. దీంతో గ్రామంలో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది.